క్లుప్తంగా

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి, నేతలు

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ మంజగుడ గ్రామానికి చెందిన 12 మంది చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎంపీపీ బాక ఈశ్వరి, పార్టీ నాయకులతో కలిసి అరకులోయ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య పరీక్షలు చేయాలని వైద్యులను కోరారు. పూర్తిగా కోలుకున్న తరువాత ఇంటికి పంపాలని సూచించారు. మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు సింహాచలం, బాబూరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ ప్రఫుల్, సిబ్బంది

సాక్షి, పాడేరు: గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందిన ఏపీజీవీబి బ్యాంకు ఖాతాదారుడు సోమెలి కృష్ణారావు కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి పథకం ద్వారా బీమా పరిహారం రూ.2లక్షలు మంజూరైంది. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామానికి చెందిన కృష్ణారావు మృతి చెందడంతో బీమా పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకున్నారు. బాధిత కుటుంబానికి బీమా సొమ్ము రూ.2లక్షలు మంజూరు కావడంతో ఏపీజీవీబీ పాడేరు శాఖ మేనేజర్ ప్రఫుల్, బీమా మిత్రాలు, సిబ్బంది గురువారం మృతుని భార్యకు పరిహారం చెక్కును పంపిణీ చేశారు.

మండల సమావేశం రేపు

అరకులోయ రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏప్రిల్ 1న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేష్ గురువారం తెలిపారు. సభ్యులు, వివిధ శాఖల అధికారులు శనివారం ఉదయం 10 గంటలకు సమావేశంకు విధిగా పాల్గొవాలని కోరారు.

ప్రమాదభరితంగా ఎండిన చెట్లు



దముకు సమీపంలోని కూలేందుకు సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టు

అనంతగిరి: మండలంలోని ములియగుడ, దముకు గ్రామాల సమీపంలోని ఎండిన చెట్లు ప్రమాదభరితంగా మారాయి. దీంతో అటువైపుగా ప్రయాణాలు సాగించే వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అరకు-విశాఖ ప్రధాన రహదారిలో రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెట్లు నానిపోయి మరింత ప్రమాదభరితంగా మారాయి. ఘాట్‌రోడ్డులోని కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను అధికారులు స్పందించి, తొలగింపు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనకు వచ్చిన భక్తులు

వీఆర్ పురం: శ్రీరామగిరిలో గురువారం నిర్వహించిన సీతారాముల కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సాయంగా భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. భద్రాచలం కూరగాయ మార్కెట్ కమిటీ సభ్యులు యడ్లపల్లి రామకృష్ణ, పసుపులేటి రామకృష్ణ ,శ్రీరెడ్డి సతీష్‌కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 10 వేల మందికి పైగా అన్నదానం చేసినట్టు వారు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటిని అందించారు. అదే విధంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

కల్యాణం..కమనీయం

- కనులపండువగా సీతారాముల వివాహ వేడుక
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు



పట్టువస్త్రాలు మోసుకెళ్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు



అరకులోయలో పూజలు చేస్తున్న భక్తులు



సుండ్రుపుట్టు రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం

సాక్షి,పాడేరు: పవిత్ర శ్రీరామనవమిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు.వేకువజాము నుంచే రామాలయాలకు భక్తులు తరలివచ్చారు. సీతారాముల విగ్రహాలను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పట్టాభి సీతారామచంద్రస్వామి వారి కల్యాణ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు మంత్రోచ్ఛరణల నడుమ భక్తిశ్రద్ధలతో కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాల్లోని భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులను మేళతాళాలత పురవీధుల్లో ఘనంగా ఊరిగించారు. పాడేరులో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఏపి మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు సుండ్రుపుట్టు రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, పూజా సామాగ్రిని ఊరేగింపుగా మోసుకువచ్చి సమర్పించారు. రామాలయంలో సీతారాముల విగ్రహాలతో పాటు కళ్యాణం జరిపే విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు. హుకుంపేట, పాడేరు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులతో పాటు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డి.పి.సురేష్ ఇతర కమిటీ సభ్యులంతా శ్రీరామ నవమి ఉత్సవాలలో పాల్గొన్నారు. తండోప తండాలుగా భక్తులు తరలివచ్చి సీతారాముల కల్యాణ వేడుకను కనులారా వీక్షించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

అరకులోయ రూరల్: కొత్తవలస,పానిరంగిని ,తాంగులగూడ,పద్మపురం, యండపల్లివలస, సుంకరమెట్ట, గ్రామల్లో సీతారాముల కల్యాణ వేడక ఘనంగా జరిగింది. కొత్తవలస ఆలయ కమిటీ సభ్యులు గంగునాయుడు, స్వామినాయుడు, కృష్ణంనాయుడు, శంకర్‌రావుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది.

డుంబ్రిగుడ: అరకు సంతబయలు గ్రామంలో జరిగిన వేడుకలో జెడ్పీటీసీ జానకమ్మ, కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హుకుంపేట: సూకురు, బాకురు గ్రామల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సత్యవతి, మురళి దంపతులు భక్తులతో పాటు వేడుకలో పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంతో పాటు దొడిపుట్టు,బొంద్రుగూడ గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పెదబయలు: మండల కేంద్రంతో పాటు గంపరాయి, గుంజివాడ,గసాబు,పన్నెడ,లక్ష్మీపేట గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. మండల కేంద్రంలో త్రినాథ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కొయ్యూరు: రాజేంద్రపాలెంలో జరిగిన వేడుకలో భక్తులతో కలిసి మండల ఉపాధ్యక్షురాలు నూకాలు, సర్పంచ్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంతో పాటు బయలుకించంగి, చౌడుపల్లి, గొందిపాకలు, తాజంగి, లంబసింగి తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

జి.మాడుగుల: స్థానిక రామాలయంలో జరిగిన వేడుకలో మాజీ మంత్రి, ఆలయ ధర్మకర్త మత్స్యరాస బాలరాజు, రూపవతి దంపతులు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, సన్యాసినాయుడు దంపతులు, మాజీ ఎంపీపీ ఎం వెంకటుగంగరాజు,పద్మ దంపతులు భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనుపోత్సవం జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు ఎం మత్స్యరాజు, మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింహాచలంరాజు, కార్యదర్శి రెడ్డిబాబు తదితరలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక రామాలయంలో జరిగిన వేడుకలో భక్తులతో కలిసి సీఐ అశోక్‌కుమార్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రంపచోడవరం: కె.ఎర్రంపాలెంలో జరిగిన వేడుకలో వైస్ ఎంపీపీ పండా కుమారి దంపతులు నవమి వేడుకల్లో పాల్గొన్నారు. దేవీపట్నం రోడ్డులోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట, ఇందుకూరు, దేవారం, శరభవరం తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిపారు. సీఐ వై.రాంబాబు దంపతులతో పాటు రాజమండ్రికి చెందిన చిలకమర్తి ఫౌండేషన్ నిర్వాహకులు రఘునాథ్ దంపతులు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక కోదండ రామాలయంలో జరిగిన వేడుకలో భారీఅన్నదానం నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంతో పాటు దూసరపాము రామాలయాల్లో జరిగిన వేడుకలో భక్తులతో కలిసి మోహన్‌కుమార్, సావిత్రి దంపతులు, చీడి శివ, నూకరత్నం దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో కోలాటం ఆకట్టుకుంది.

వై.రామవరం: మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కూనవరం: మండల కేంద్రంలో పట్టాభి సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మేడిది శివరామ్ దంపతులు భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎటపాక: గౌరిదేవిపేట, రాయనపేట, పురుషోత్తపట్టణం, నందిగామ, నెల్లిపాక గ్రామాల్లోని రామాలయాల్లో తెల్లవారుజామునుండే నవమి సందడి నెలకొంది. సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకిపై ఊరేగించారు. ఎటపాక, ఉప్పగుండాలను భక్తులు దర్శించుకున్నారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి వేడినీటిని బాటిళ్లలో తీసుకుని వెనుదిరిగారు. ఎటపాకలోని జటాయువు మండపాన్ని వందలాది భక్తులు దర్శించుకున్నారు.



సూకురులోని వేడుకలో పూజలు చేస్తున్న భక్తులు



కూనవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రాజవొమ్మంగిలో చిన్నారుల కోలాటం



వై.రామవరంలో సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు



గౌరిదేవిపేటలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



చింతూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అరకు సంతబయలు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పవనగిరి క్షేత్రంలోని పూజలు చేస్తున్న భక్తులు



రామదుర్గం కొండపై సీతారాముల కల్యాణానికి తరలివచ్చిన భక్తులు



జి.మాడుగులలో సీతారాముల కల్యాణ మహోత్సం



ముంచంగిపుట్టులో పూజలు చేస్తున్న భక్తులు



కాకరపాడులో సీతారామ కల్యాణం



చింతపల్లిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఎర్రంపాలెంలో సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతగిరి: మండలంలోని కొత్తూరులోని కేజీబీవీలోని ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి కమ్మిడి లత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో-40 సీట్లు, 7,8,9 పలు సీట్లు, ఇంటర్మీడియట్ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయని, వచ్చే నెల 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

హుకుంపేట: స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 6వ తరగతిలో-40 సీట్లు, 7వ తరగతిలో-2 సీట్లు, 8వ తరగతికి ఒక సీట్, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్‌లో-40 సీట్లు ఖాళీలున్నట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జయప్రద చెప్పారు. ఏప్రిల్ 20వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలకు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని లేని పక్షంలో పాఠశాలను సంప్రదించాలన్నారు. మరిని వివరాలు కోసం 8500993769 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

తాగునీటి పథకం ప్రారంభం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా ట్రస్టు ప్రతినిధులు

చింతపల్లి: మండలంలోని బయలు కించంగి వద్ద శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం తాగునీటి పథకం ప్రారంభమైంది. గ్రామస్తులు శ్రమదానం చేసుకోగా పథకం ఏర్పాటుకు అవసరమైన రూ.4లక్షల విలువైన నిర్మాణ సామగ్రిని సంస్థ ప్రతినిధులు వితరణగా ఇచ్చారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పథకాన్ని గురువారం ప్రారంభించారు. సత్యసాయి సేవా ట్రస్టు ప్రతినిధులు వంశీ, సిరివెన్నెల శ్రీరామశాస్త్రి, గణేష్, మూర్తి, అడపా విష్ణుమూర్తి, చౌడుపల్లి సర్పంచ్ కొర్రా లలిత, ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి, మాజీ సర్పంచ్‌లు దేవుడమ్మ, కృష్ణపడాల్, అప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం గింజలపై రామనామం





శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నాగులాపల్లి సీతారాముల ఆలయంలో కర్రి యశోద దంపతులు బియ్యం గింజలపై శ్రీరామ నామం రాశారు. వేలాది బియ్యం గింజలపై శ్రీరామ నామం రాసి, వాటిని తలంబ్రాలుగా సీతారామ కల్యాణంలో వినియోగించాల్సిందిగా ఆలయానికి సమర్పించారు.

– మునగపాక

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ రేపు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ముఖ్య అతిథులుగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. ఏపీఎం ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతపల్లిరూరల్: చింతపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో ఏప్రిల్ 1న (శనివారం) ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈఈ ఎం.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డొనూరు నుంచి చింతపల్లి వరకూ ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ఇతరత్రా నిర్వహణ చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దిమిలిలో శాస్త్రవేత్తల పర్యటన నేడు

రాంబిల్లి : దిమిలి గ్రామంలో శుక్రవారం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పర్యటించనున్నట్లు వీఏఏ మేఘన గురువారం తెలిపారు. రబీ వరి పైరును పరిశీలించి పొలంబడి కార్యక్రమంలో భాగంగా వీఏఏలు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అందని సాగునీరు... ఆందోళనలో రైతులు



ఇందుకూరుపేటలోని అడుగంటిన పోతురెడ్డివారి చెరువు

- ఆక్రమణలో చెరువు గర్భాలు
- శివారు పొలాలకు అందని నీరు



ఇందుకూరుపేటలో బీటలు వారిన వరి పంట

దేవీపట్నం: ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుండి వర్షాలు సమృద్ధిగా కురవడంతో కొండవాగులు నుంచి పుష్కలంగా సాగు నీరు లభ్యం కావడంతో ఖరీఫ్ పంటల అనంతరం సాగునీటి చెరువుల్లో నీటి లభ్యతను బట్టి రబీ సీజన్‌గా మొక్కజొన్న, వరి పంటల సాగు చేపట్టారు. సాగు ఆలస్యం కావడంతో పంటల చివరి దశలో సాగునీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడింది. ఇందుకూరుపేట, ఇందుకూరు, శరభవరం, దేవారం పంచాయితీల్లో వరి 1137 ఎకరాలు , మొక్కజొన్న 806 ఎకరాల్లో సాగు చేపట్టారు. కొండ వాగులకు తోడు ముసురుమిల్లి ప్రాజెక్టు నుండి నీటి లభ్యత ఉన్నప్పటికీ శివారు గ్రామాలైన ఎం.రావిలంక, దేవారం, శరభవరం, ఇందుకూరుపేట, పెదరమణయ్యపేట తదితర గ్రామాలకు నీరందడంలేదు. ఈ కారణంగా చివరి దశలో పంటలు దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిండుకున్న పోతురెడ్డివారి చెరువు

ఇందుకూరుపేటలో దాదాపు 450 ఎకరాల పంట భూములకు సాగునీందరించే పోతురెడ్డివారి చెరువు నీరు లేక వెలవెలబోతోంది. చెరువు విస్తీర్ణం 16 ఎకరాలు. చెరువు ఆయకట్టుకు నీరందించాలంటే ఒక పంట కాలంలో సుమారు ఐదుసార్లు పూర్తిగా చెరువు నీటితో నిండి ఉండాలి. కానీ చెరువు కబ్జాకోరల్లో ఉండడంతో పట్టుమని పదెకరాలు కూడా ఉండటంలేదని రైతులు వాపోతున్నారు. కబ్జాచెర నుండి చెరువును విడిపించి సాగునీరుతో నింపితే ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. మరో నెల రోజుల వరకూ సాగు నీరు అందితే తప్ప తమ పంటలు గట్టెక్కవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా స్టోన్ ప్లాంటేషన్

ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: రెవెన్యూ డివిజన్ పరిధిలోని రీసర్వే పూర్తయిన అన్ని మండలాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ చేపట్టామని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. మండలంలోని దుగ్గా, వి.వి.పట్నం గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను తహసీల్దార్ అన్నాజీరావుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నర్సీపట్నం, మాకవరపాలెం, మాడుగుల మండలాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. ఈ మూడు మండలాల్లోని ప్రభుత్వ, జిరాయితీ రాళ్లను సరిహద్దుల్లో వేస్తున్నామన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌ను త్వరగా పూర్తిగా చేయాలని ఆయా తహసీల్దార్లకు సూచించామన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న అమరపల్లి నూక అప్పారావును అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ మేరకు అప్పారావు నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ నరసింగరావు

అనకాపల్లిటౌన్ : త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను రూరల్ ఎస్ఐ నరసింగరావు, అగ్నిమాపక అధికారి లక్ష్మయ్యలు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు పాల్గొన్నారు.